




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 303 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 5 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :303 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 5 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా)

- మిగతా 2లో




## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- రావణ్ కు మద్దతుగా నిలిచిన ప్రకాశ్ రాజ్
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వరుస ట్వీట్లు
- రావణ్ తో ఉన్న చీకటి సంబంధాలు ఏమిటో చెప్పాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:యూట్యూబర్ ప్రశ్న రావణ్ (జోసెఫ్) అరెస్టుల పర్వంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఘాటుగా బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కావాలనే అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని రగిల్చేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందని ఆయన

- మిగతా 2లో

## జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"



- కడప స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ హయాంలోనే అన్నీ జరిగాయన్న అవినాశ్
- 2022లోనే 1100 ఎకరాల భూసేకరణ జరిగిందని వెల్లడి
- జగన్‌ను దూషించడానికే కడప సభ పెట్టినట్లుందన్న అవినాశ్

పెన్ పవర్ డెస్క్:"కడప స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి భూసేకరణ, పర్యావరణ అనుమతులు, జీవోల జారీ అంతా జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగితే...

- మిగతా 2లో

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

పెన్ పవర్ డెస్క్: వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై తూర్పుగోదావరి జిల్లా అధికారులతో మంత్రి నారాయణ సమీక్షించారు. గోదావరి పుష్కరాల కోసం సీఎం చంద్రబాబు రూ.1500 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వీటిలో కేవలం రాజమహేంద్రవరంలో పుష్కరాల కోసమే రూ.580 కోట్ల పనులకు సీఎం అనుమతించారని చెప్పారు.

- మిగతా 2లో





## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని వెల్లడి
- పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని వ్యూహాత్మకంగా ఎదుర్కొన్నామని స్పష్టం
- చమురు రంగ కంపెనీలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని వెల్లడి
- ఇంధనం అందించే దేశాల సంఖ్యను 40కి పెంచుకున్నామన్న మోదీ

- మిగతా 2లో

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

- ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ప్రధాని మోదీకి ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు
- మెల్‌బోర్న్ ఈవెంట్‌కు సంబంధించిన ఫేస్‌బుక్ పోస్ట్ కింద హెచ్చరికతో కూడిన కామెంట్
- రంగంలోకి దిగిన ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు.. ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు
- ప్రధాని పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేసిన అధికారులు
- భద్రతను కట్టుదిట్టం చేసి, విచారణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు

2లో





## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

### కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్

- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు

- మిగతా 2లో

## ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం
- తన తొలి గెలుపునకు వేదికైన మిడ్జిల్‌లో కృతజ్ఞతా కార్యక్రమం
- జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగిన రాజకీయ ప్రయాణం
- ప్రజల ఆకాంక్షల నెరవేర్పుకే కృషి చేస్తానన్న రేవంత్



పెన్ పవర్ డెస్క్: ప్రజా ప్రతినిధిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో శనివారం

- మిగతా 2లో



## ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

- పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావణ్ అలియాస్ జోసెఫ్
- కోర్టులు బెయిల్ ఇస్తున్నా ఇతర కేసుల్లో అరెస్ట్ చేస్తున్న పోలీసులు
- కూటమి ప్రభుత్వంపై ప్రకాశ్ రాజ్ విమర్శలు

- మిగతా 2లో



## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

### కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ

- జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ
- మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- మొదటి పేజి తరువాయి

ఆయన పర్యటించారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం, 2006 జులై 4న ఇదే మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి, 2007లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, 2018 ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ పట్టువదలకుండా 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఘనవిజయం సాధించారు. 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టి, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మిడ్జిల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఉర్కొండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తన రాజకీయ ప్రస్థానం తొలినాళ్లలో అండగా నిలిచిన మద్దతుదారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ తన రెండు దశాబ్దాల ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు."మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి ప్రతి గుండెలో 'రేవంత్ అన్న' వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం" అని ఆయన 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహా పలువురు నేతలు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన ప్రస్థానానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.

# మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు.ఈ పర్యటన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. భారత్-కొరియా మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### లోకేశ్ పర్యటన షెడ్యూల్

జులై 5న సియోల్‌లో ఇండియా డయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు.

జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి.

జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది.జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఒ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు.జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు.

అదే రోజు రాత్రి, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించే ప్రత్యేక రోడ్ షోలో పాల్గొంటారు. 11వ తేదీన దక్షిణ కొరియా నుంచి తిరిగి రానున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. మీడియా ముఖంగా ప్రకాశ్ రాజ్, రావణ్‌లపై విరుచుకుపడిన మంత్రి... వారిద్దరినీ సమాజ విద్రోహ శక్తులుగా అభివర్ణించారు. అసలు ఈ వివాదాస్పద యూట్యూబర్‌తో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న చీకటి సంబంధాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు సాగాయని, హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని.. అప్పుడు లేవని ప్రకాశ్ రాజ్ గొంతు ఇప్పుడు ఎందుకు లేస్తోందని మంత్రి కందుల దుర్గేశ్ నిలదీశారు. "నాడు మూగనోము నోమిన మీరు.. నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రతి నెలా ఎంత డబ్బు అందుకుంటున్నారు?" అంటూ నేరుగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి శాంతిభద్రతలను దెబ్బతీయడానికే ఇలాంటి శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందని మంత్రి హెచ్చరించారు.

# జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆ క్రెడిట్ నాదే అని చెప్పుకోవడం హాస్యాస్పదం" అని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి విమర్శించారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పాత ప్రాజెక్టులపై 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతోందని మండిపడ్డారు.2019లోనే జేఎస్‌డబ్ల్యూ సంస్థను కడపలో స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ ప్రభుత్వం ఒప్పించిందని అన్నారు. ఆ తర్వాత 2022లో ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన అధికారిక జీవోలను జారీ చేయడంతో పాటు, ఫేజ్-1 కింద 1100 ఎకరాల భూసేకరణను కూడా పూర్తి చేసిందన్నారు. 2023 ఫిబ్రవరిలో అప్పటి సీఎం జగన్ స్వయంగా ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని తెలిపారు. పర్యావరణ అనుమతులు సహా అన్ని క్లియరెన్సులు తమ ప్రభుత్వమే తెచ్చిందని.. ఈ విషయాన్ని జేఎస్‌డబ్ల్యూ అధినేత సజ్జన్ జిందాల్ స్వయంగా ప్రకటించారని తెలిపారు. తాజాగా కడప సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ.. ఆ సభ స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం కాకుండా, కేవలం జగన్‌ను దూషించడానికే పెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

ఇదే క్రమంలో అమరావతి రాజధానిపైనా అవినాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతి అనేది రాష్ట్ర ప్రజలందరి రాజధాని కాదని, అది కేవలం ఒక వర్గానికి చెందిన రాజధానిగా మారిందని ఆరోపించారు. ఈ విషయాన్ని స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా గతంలో అంగీకరించారని అన్నారు. నాడు శివరామకృష్ణ కమిటీ ఇచ్చిన శాస్త్రీయ సూచనలను తుంగలో తొక్కిన చంద్రబాబు... ఇప్పుడు అమరావతి కోసం ఏకంగా రూ.2 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేయాలని చూస్తున్నారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా జగన్... మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను అనుసంధానిస్తూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే ఆచరణాత్మకమైన 'మావిగన్' నమూనాను ప్రతిపాదించారని చెప్పారు.

# కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు... వెలికితీస్తాం

తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

### కుప్పంలోనూ బంగారు గనులు

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు.

మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్?గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

### ఉద్యోగాల కేంద్రంగా కుప్పం

ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు.

### కాలుష్య రహిత, సుస్థిర అభివృద్ధి

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ-సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

### గత పాలనపై తీవ్ర విమర్శలు

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టిందని, అభివృద్ధిని అడ్డుకుందని చంద్రబాబు ఆరోపించారు. "నీళ్లు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడారు. 2019-24 మధ్య నన్ను నా నియోజకవర్గంలోనే తిరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. నాకు సహకరించిన వారిని వేధించారు" అని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే తమ అజెండా అని స్పష్టం చేశారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి డ్రామా, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు.

### 'మావిగన్' అంటూ గొడ్డలి పార్టీ వింత వాదన

రాజధానిపై గత ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడిందని విమర్శించారు. ప్రజలందరూ అమరావతినే రాజధానిగా కోరుకుంటుంటే, 'గొడ్డలి పార్టీ' మాత్రం వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలంటోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అని తాము అనడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కుప్పం అభివృద్ధికి సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సరైన సమయంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ప్రణాళికలు మరియు పటిష్ఠమైన దౌత్యం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో ఒక భారీ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు."నవ భారత సంకల్పం, కృషితో 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని మనం అధిగమించాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హర్ముజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన సరఫరాకు తీవ్ర విఘాతం ఏర్పడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి, జాతీయ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దౌత్య సంబంధాల ద్వారా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.ఇంధన సంక్షోభం తలెత్తిన సమయంలో

వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా నిలిచిందని ప్రధాని వివరించారు. దౌత్యపరమైన చొరవతో, మనకు ఇంధనం అందించే దేశాల సంఖ్యను 25 నుంచి 40కి పెంచుకున్నామని, దీనివల్ల దేశంలో ఎక్కడా కొరత ఏర్పడకుండా చూడగలిగామని తెలిపారు. కొందరు ప్రతిపక్ష నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రభుత్వం తెరవెనుక చేసిన కృషి చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

# ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్)పై ఏపీలో పలు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. బెయిల్ పై అతడు బయటకు వస్తున్నప్పటికీ... ఇప్పటికే నమోదైన ఇతర కేసుల్లో మళ్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. దీనిపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ట్యాగ్ చేస్తూ ఆయన విమర్శనాత్మకంగా ట్వీట్ చేశారు."అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. "ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. రావణ్ ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ... ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు.

# ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు కొద్ది రోజుల ముందు ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు రావడం కలకలం రేపింది. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు (ఏఎఫ్‌పీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాని మోదీ పర్యటనను, ప్రవాస భారతీయులతో జరగనున్న భారీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బెదిరింపు వెలువడింది. వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ జూలై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమ ప్రచారంలో భాగంగా ఫేస్‌బుక్‌లో పెట్టిన ఒక పోస్ట్ కింద 'అబు ముస్తఫా' అనే ఖాతా నుంచి బెదిరింపు కామెంట్ వచ్చింది. "ఈవెంట్ సమయంలో స్టేడియం పైకప్పులు మూసి ఉంచడం మంచిది. లేదంటే, ఆయన తన చావు కోసమే ఆస్ట్రేలియాకు వస్తున్నట్లు అవుతుంది" అని ఆ కామెంట్‌లో పేర్కొన్నారు.ఈ విషయం జూలై 3న ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వెంటనే రంగంలోకి దిగిన దర్యాప్తు అధికారులు, బెదిరింపు పోస్ట్ చేసిన ఖాతాకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు సమాచారం. అయితే, దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ విషయంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి ఏఎఫ్‌పీ నిరాకరించింది.

ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేసినట్లు ప్రకటించలేదు.ఆస్ట్రేలియా-భారత్ వార్షిక నాయకత్వ సదస్సు కోసం ప్రధాని మోదీ జూలై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో రక్షణ, భద్రత, వాణిజ్యం వంటి కీలక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ బెదిరింపు నేపథ్యంలో ఆస్ట్రేలియా భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని మోదీ పర్యటనకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, ఆయన పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు.

# తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

- మొదటి పేజి తరువాయి

అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు.రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి

పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

# ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని రిజిజు వివరించారు. మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి.ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్సీపీఐలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి.మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

### ప్రభుత్వ అజెండాలో కీలక బిల్లులు

ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

అలాగే, దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీ-డోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

'పుష్కరాలకు రాజమహేంద్రవరంలో కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించాం. పనులు వెంటనే ప్రారంభించాలన్న సీఎం ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులు నిర్ణయించాం. ప్రస్తుత నిధులతో తొలిదశ పనులు ప్రారంభిస్తున్నాం. రాజమహేంద్రవరంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తాం. గోదావరిలో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకుంటాం. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం రూ.140కోట్లతో పనులు ప్రారంభిస్తాం.. రోడ్ల నిర్మాణం, విస్తరణ, లైటింగ్ పనులు చేపడతాం. టీడీఆర్ బాండ్లు జారీ చేసి, నగరంలో రోడ్ల విస్తరణ త్వరలో చేపడతాం. గోదావరి కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నిధులు కేటాయిస్తాం. ఘాట్ల ఆధునికీకరణ, విస్తరణను ఇరిగేషన్ శాఖ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తాం" అని నారాయణ అన్నారు.

# వంతెన కు ఇరువైపులా రక్షణ గోడను నిర్మించండి.



**కురుపాం జూలై 04 పెన్ పవర్.** కురుపాం మండలం లేవిడి - నీలకంఠాపురం మార్గంలో కొత్తూరు సమీపంలోని పురాతన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఈ మేరకు స్థానికులు మాట్లాడుతూ,ఈ వంతెన పురాతమైనదని ఇదే మార్గంలో నిత్యం వాహనాలు తిరుగుతుంటాయని,ఇరుకుగా ఉండడంతో ఆకస్మాతుగా వెహికల్ ఎదురైతే తప్పుకునే అవకాశం కూడా లేదని చాలా సందర్భాల్లో ఈ వంతెన వద్ద ప్రమాదాలు జరిగాయని చోదకులు వాపోతున్నారు.రాత్రి వేళల్లో కనిపించక అదుపుతప్పి కొండవాగులో పడిపోయే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు నాయకులు చొరవ తీసుకొని వాహన దారుల ప్రాణాలను కాపాడుతారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


# పెన్ పవర్

## ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా


## వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు

### జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జులై 4:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129 వ జయంతి వేడుకలు నగర వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో సీతమ్మదార అల్లూరి సీతారామరాజు గ విగ్రహం వద్ద ఘనంగా జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహనికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు. బ్రిటిష్ పాలనకు ధైర్యంగా ఎదిరించి ఆదివాసీల హక్కులు,దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహానీయుడని కొనియాడారు. ఆయన దేశభక్తి,ధైర్యసాహసాలు, త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.మహానీయుల జయంతిని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా వారి ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు.అల్లూరి త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి,ప్రజా సేవకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు తిప్పల దేవన్ రెడ్డి,మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, నియోజకవర్గ పరిశీలకులు జహీర్ అహ్మద్,పేడాడ రమణి కుమారి పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి పార్టీ సీనియర్ నాయుకులు రొంగలి జగన్నాధం.సతీష్ వర్మ, జాన్ వెస్లీ.పల్లా దుర్గ ,జి వి రామ్ చంద్ర రావు.రమణి రెడ్డి , సేనాపతి అప్పారావు ద్రోణం రాజు శ్రీ వాత్సవ్ జిలకర్ర నాగేంద్ర ,అనిల్ కుమార్ రాజు పివి సురేష్ జగన్నాధరెడ్డి, ఏం.సునీల్ .కర్రి రామ్ రెడ్డి , మారుతీ ప్రసాద సనపల రవింద్ర భరత, మార్కదేయలు ,బొండ ఉమా. షరీఫ్ సత్యనారయణ, రెయ్యి వెంకటరమణ సాడి పద్మా రెడ్డి వావిలపల్లి ప్రసాద్, పిల్ల సుజాత,అల్లంపల్లి రాజ బాబు , బిపిఎన్ కుమార్ జైన్ , బాబ్జి . అద్దాల కృపాజ్యోతి ప్రసాద్ , శ్రీనివాస్ రెడ్డి , ఎరంశీట్టి శ్రీనువాస్ రావు శ్రీను, రమేష్, మరియు కార్యకర్తలు, మహిళాలు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన ప్రాంతాల్లో ఓటర్ల నమోదు సవాళ్లపై ఎన్నికల సంఘం దృష్టి

## అల్లూరిలో ఓటర్ల జాబితా సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 4:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ--2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాల పురోగతిపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.బి. జోషి శనివారం కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టి. నిశాంతి ఆయనకు స్వాగతం పలికి జిల్లాలో చేపడుతున్న సవరణ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియలో ఎదురవుతున్న సవాళ్లు, క్షేత్రస్థాయి యంత్రాంగం పనితీరుపై విస్తృతంగా చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత తక్కువగా ఉండటం, మారుమూల గ్రామాల్లో మొబైల్, ఇంటర్నెట్ సౌకర్యాల కొరత, క్లిష్టమైన రవాణా పరిస్థితులు, భాషాపరమైన సమస్యలు, ఒకే పేర్లు అధికంగా ఉండటంతో ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్ వివరించారు. జిల్లాలో బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌ఓలు) నియామకాన్ని వంద శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అరకు వ్యాలీ (ఎస్టీ) నియోజకవర్గంలో 306 మంది బీఎల్‌ఓలు, 33 మంది సూపర్‌వైజర్లు, పాడేరు (ఎస్టీ) నియోజకవర్గంలో 318 మంది బీఎల్‌ఓలు, 24 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 624 మంది బీఎల్‌ఓలు, 57 మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నట్లు వెల్లడించారు.ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, రాజకీయ పార్టీలతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్‌ఏలు) నియామకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. శిక్షణ, హౌస్ టు హౌస్ వెరిఫికేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం, తుది ఓటర్ల జాబితా ప్రచురణ తదితర అంశాలను ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఆర్డీవో భుజంగరావు, కలెక్టరేట్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## 85 వార్డులో ఎన్యుమరేషన్ అధికారులు స్పెషల్ డ్రైవ్



**కూర్మన్నపాలెం: పెన్ పవర్, జూలై 04**

ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ సర్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా దెబ్బ పాలెం సచివాలయంలో ఎన్యుమరేషన్ పారాలు పరిశీలిస్తున్న 85 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , ఇన్చార్జ్ కర్రి దశేంద్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్కాగా ప్రతి వాటర్ ను గుర్తించి వారందరికీ ఎనిమరేషన్ పారాల అందించి మరల ఆ యొక్క పారాలు పూర్తిగా నింపి సచివాలయం కు అందజేసి ఓటర్ల సమగ్ర సవరణకు ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, సీనియర్ మహిళా నాయకురాలు పట్టా పైడి రత్నం, సీనియర్ నాయకులు యూనిట్ ఇన్చార్జ్ ఈగల పోలినాయుడు, బూత్ ఇన్చార్జులు శీరంశెట్టి బాబ్జి, ఉరుకూటి అప్పలరాజు, సీనియర్ నాయకుడు ఉకూటి రామనాయుడు, మాజీ స్కూల్ చైర్మన్ ఈగల రమణ, ఛట్టి అంజి, సచివాలయం బిఎల్వోలు ,దిలీప్ కుమార్, శ్రేయ, కింతాడ అప్పారావు , గొంతిన మణేంద్ర, జంప ఉమాదేవి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఎస్ఐఆర్ ఫారాల సేకరణలో పీసా కమిటీలు భాగస్వాములు కావాలి

- నేడు అన్ని సచివాలయాల్లో గ్రామసభలు
- ఎస్ఐఆర్ సర్వేకు పీసా కమిటీల సహకారం అవసరం

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, జూలై 4:** ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పీసా గ్రామసభ కమిటీల సహకారం అవసరమని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బీహెచ్‌వీ రమణబాబు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ కోసం క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నామని, అయితే ఈ ప్రక్రియపై గ్రామీణ ప్రాంతాల్లో చాలామందికి పూర్తి అవగాహన లేదన్నారు. అన్ని పంచాయతీల పరిధిలోని గ్రామసభ పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి వారి వివరాలను సేకరించి సర్వే విజయవంతానికి సహకరించాలని కోరారు.ఇప్పటికే బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) గ్రామాల్లో ఎస్ఐఆర్ ఫారాలు పంపిణీ చేశారని, కొంత మేరకు వాటిని తిరిగి సేకరించినప్పటికీ ఇంకా అనేక ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పీసా కమిటీ సభ్యులు గ్రామాల్లో పరిశీలన నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఫారాలను సేకరించి గ్రామసభలో బీఎల్‌ఓలు లేదా గ్రామ సచివాలయ కార్యదర్శులకు అందించాలని సూచించారు.అర్హులైన వారికి ఫారాలు అందకపోతే వారి వివరాలు, ఫోన్ నంబర్, ఫొటోతో పాటు నమోదు చేసి సంబంధిత బీఎల్‌ఓలు లేదా కార్యదర్శులకు అందజేయాలని కోరారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు పీసా కమిటీ సభ్యులు చొరవ తీసుకుని ఎస్ఐఆర్ సర్వే సక్రమంగా పూర్తయ్యేలా సహకరించాలని ఈ విషయమై అన్ని సచివాలయాలలో ఆదివారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణబాబు పిలుపునిచ్చారు.



# ఘనంగా అల్లూరి 129వ జయంతి వేడుకలు






- అల్లూరి సమాధుల వద్ద నివాళులు అర్పించిన అయ్యన్న, కొణతాల
- అధికారికంగా అల్లూరి జయంతి వేడుకలు

**నర్సీపట్నం, పెన్ పవర్ (జూలై 4 ) :** మన్యం వీరుడు అల్లూరి శ్రీరామరాజు 129వ జయంతి వేడుకలు నర్సీపట్నం డివిజన్లో అట్టహాసంగా జరిగాయి. గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో అల్లూరి శ్రీరామరాజు, గంటం దొర సమాధులు ఉన్న అల్లూరి పార్కులో జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. అల్లూరి జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరయ్యారు. ముందుగా అల్లూరి శ్రీరామరాజు, గాం గంటం దొర సమాధుల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి అంజలి ఘటించారు. అల్లూరి శ్రీరామరాజు విగ్రహానికి అధికారులతో పాటు పూలమాలలు వేసి నమస్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభను జ్యోతి ప్రజ్వలన చేసి స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు ప్రసంగిస్తూ స్వాతంత్ర పోరాట చరిత్రలో విశాఖ మన్యంలో జరిగిన సాయుధ పోరాటం సువర్ణ అక్షరాలతో లిఖించ తగ్గదని కొనియాడారు. అప్పటి బ్రిటిష్ అధికారులు గిరిజనులను చిత్రహింసలు చేయడాన్ని చూసి శ్రీరామరాజు చలించిపోయారని, అతి చిన్న వయసులోనే ఆయుధం పట్టి తెల్ల దొరలను ఎదిరించి, గడగడలాడించిన ధీరుడని కొనియాడారు. స్వాతంత్రోద్యమంలో అల్లూరి శ్రీరామరాజు పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. ఇలాంటి ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాలతో వచ్చిన స్వాతంత్రాన్ని, స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడు పైన ఉందన్నారు. అల్లూరి శ్రీరామరాజు, గంటం దొర సమాధులు ఉన్న పార్కును టూరిజం ప్రదేశంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పార్కు అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు బీద మస్తానావు 10 లక్షలు, పార్లమెంట్ సభ్యులు కలిసిశెట్టి అప్పలనాయుడు 10 లక్షలు కేటాయించారని తెలిపారు. అలాగే అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ పది లక్షలు కేటాయించారని, ఆ నిధులతో ప్రొజెక్టర్ రూమ్, స్లాబ్ పనులు జరిగాయని, ప్రస్తుతం ఇంటీరియర్ పనులు జరుగుతున్నాయని వివరించారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఆంగ్లేయులను ఎదిరించి, స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన ధీరుడు అల్లూరి శ్రీరామరాజని కొనియాడారు. భావితరాలకు అల్లూరి శ్రీరామరాజు పోరాట స్ఫూర్తిని తెలియజేసేలా అల్లూరి పార్క్ అభివృద్ధికి కృషి చేస్తున్న అయ్యన్నపాత్రుడును అభినందించారు. అల్లూరి జీవన గమనాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ , ఎస్పీ తుహిన్ సిన్హా, ఆర్డిఓ వి.వి రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జడ్పిటిసి సుకల రమణమ్మ, సాంస్కృతిక శాఖ అధికారులు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, టిడిపి నాయకులు అడిగర్ల నానిబాబు, చిటికెల తారక వేణుగోపాల్, గణపతిరాజు బంగార్రాజు, అధిక సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



# మీ త్యాగం జాతికి అంకితం. అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో. ఎస్సై దుర్గాప్రసాద్.




**మన్యం వీరుడు దేశభక్తుడు అల్లూరి సీతారామరాజు.129.వ,జయతి వేడుకలు.**

**స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ.**

**హుకుంపేట పెన్ పవర్ జులై 4 :**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో స్థానిక ఎస్సై దుర్గ ప్రసాద్ మరియు మానవ హక్కుల సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సల్లంగి.సూర్యనారాయణ చేతులమీదుగా జయంతి వేడుకలు ఘనంగా జరిపారు ఈ సందర్భంగా స్థానిక ఎస్సై దుర్గ ప్రసాద్ మరియు సల్లంగి సూర్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీప్రాంతంలో ఆదివాల హక్కులకోసం,అన్యాయపుపాలనకువ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు కోటి కోటి వందనాలు అంటూ దేశాన్ని బ్రిటిష్ సంకెళ్ళ నుంచి విముక్తి కోసంసాయుధపోరాటాన్ని సాధనంగా చేసుకొని బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మన్యం విప్లవ యోధుడు బానిసత్వ.విముక్తి కోసం, గిరిజన ప్రజల హక్కులకోసం, తెల్లదొరలపై తిరుగుబడిన విప్లవ గర్జన సింహం, భారత స్వాతం త్రోద్యామానికి వెలుగు చుక్కల నిలిచిన తెలుగుదేశం,సమరయోధడు తెలుగు తేజం, మన్యం వీరుడు, ఆయన పోరాటం మన స్వాభిమానం, మనం ఆయన త్యాగం, మన ప్రేరణ,ఆయన ఆశయం మన లక్ష్యం, నేను చనిపోవచ్చు కానీ నా దేశం స్వతంత్రం అవ్వాల్సిందే ఆది నా జీవితం కంటే ఎంతో గొప్పది అంటు ఆదివాసుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహానీయుడు అల్లూరి సీతారామరాజు ఆయనకు జయంతి శుభాకాంక్షలు తెలుపుతు ఆయన చేసినసేవలుగురించి స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అరకు అసెంబ్లీ ఐటిడీపీ అధ్యక్షులు మరియు పీసా మండల ప్రధాన కార్యదర్శి జన్ని.వెంకటరమణ, టిడిపి అసెంబ్లీ ఆర్గనైజేషన్ సెక్రటరీ మరియు పేసా మండల అధ్యక్షులు చప్పాలి. శంకరరావు మరియు తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు వంతల.కోటేశ్వరరావు , స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది నాగిరెడ్డి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

## వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో వైద్య శిబిరం



**గాజువాక: పెన్ పవర్, జూలై 04:**జీవీఎంసీ 65 వ వార్డు బానోజీ తోట వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో
హనుమంత్ కొండల రావు కుటుంబం సభ్యులు వారి ఆర్థిక సహాయంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో ఆరోగ్యమే మహాభాగ్యం లో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య సేవలు అందించాలని దృక్పథంతో అందరికీ ఉచిత వైద్యం పుష్పగిరి కంటి హాస్పటల్ మేడ్ కోవర్ హాస్పిటల్ వీడెంటల్ వారి సౌజన్యంతో నియోజకవర్గ ప్రజలకు ఉచితముగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తర ఆంధ్రలో ఉత్తర ముఖముగా వెలసిన గరుడాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయం ఇది రెండవది ఉత్తర ద్వారములో స్వయంభుగా వెలసిన ఆలయం భక్తులు కోరిన కోరికలు తీర్చే స్వామి వెంకటేశ్వర స్వామి. స్వామివారికి ఏడు వారాలు ముడుపులు కట్టి ఎనిమిదవ వారం మొక్కు తీర్చుకున్న వారికి స్వామివారి కరుణ కటాక్షాలు వారిపై ఉంటాయని భక్తులు ప్రగాఢ నమ్మకం. అర్చకులు రోశీపిచర్ల శ్రీనివాసాచార్యులు వారు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఏం ఎస్ ఎల్ రాజు,భాగ్యరాజు,సింధు, షీలా హాస్పిటల్ సిబ్బంది పెంటకోట నాగేశ్వరరావు,జయరాజ్, గొరుసు రామలక్ష్మి,జానకి, పెంతకోట రాజు, పి.రామలక్ష్మి, ఓమి ఈశ్వరి, రేణుక , జీవన్ జ్యోతి,సిహెచ్ పార్వతి,బుద్ద రమణ మరియు ఆలయ సేవకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోపాలపట్నం జెడ్పీ స్కూల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం

- సీపీ ఆదేశాలతో సీఐ సన్యాసినాయుడు ప్రత్యేక చొరవ
- డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు పిలుపు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 4 :** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గోపాలపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తును కూడా దెబ్బతీసే ప్రమాదకరమైన వ్యసనమని వివరించారు. డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తులు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు చదువు, ఉపాధి అవకాశాలు కోల్పోయి నేరాల వైపు మళ్లే ప్రమాదం ఉంటుందని తెలిపారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైందని, ఈ సమయంలో చెడు స్నేహాలు, తప్పుడు అలవాట్లు, మాదకద్రవ్యాల వంటి ప్రలోభాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యనే భవిష్యత్తుకు బలమైన పునాది అని, లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని ప్రోత్సహించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ ప్రజల సహకారంతో నిరంతరం చర్యలు చేపడుతోందని, విద్యార్థులు కూడా ఈ సామాజిక బాధ్యతలో భాగస్వాములు కావాలని కోరారు. పాఠశాల యాజమాన్యం పోలీసు శాఖ చేపడుతున్న ఈ అవగాహన కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, చట్టాలపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. గోపాలపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విప్లవ యోధుడు.అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి.




**కురుపాం జులై 04 పెన్ పవర్.**కురుపాం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మండల అధ్యక్షులు బోటు అనిల్ కుమార్ ఘన నివాళులు అర్పించారు ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ యోధుడు,గిరిజనుల ఆరాధ్య దైవం గిరిజనుల హక్కుల కోసం, భారతదేశ స్వతంత్రం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు అని అన్నారు కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బాలంకి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాసరావు,ఓబీసీ మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ గెంబలి ప్రదీప్,ఓబీసీ మోర్చా మండల మండల అధ్యక్షులు పొట్నూరు శ్రీనివాసరావు,ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు కొండ గొర్రె గోపాల్,కార్యకర్త విద్యాసాగర్ పాల్గొన్నారు

## ఘనంగా వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనసేన నాయకులు బెహరా భాస్కరరావు




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 4 :** సింహాచలం గోశాల జంక్షన్‌లో వంగవీటి మోహనరంగా మిత్రమండలి ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన చేతుల మీదుగా కేక్ కట్ చేసి, అనంతరం వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ, వంగవీటి మోహనరంగా ప్రజల కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాధా--రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షులు గేదెల మురళీకృష్ణ, రాధా--రంగా మిత్రమండలి ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ దత్తాత్రేయ, కర్రి సత్తిబాబు, గంగ్రెడ్డి పెదబాబు, కంపర కోటేశ్వరరావు, ధవళ మోహన్, గొంతిన నాగరాజు, కంపర సత్తిబాబు, బల్ల రమణ, ఈ.వి. రమణ, ఇల్లపు సురేష్, మనోహర్, రాము మాస్టర్, చిక్కాల ఈశ్వరరావు, బెహరా సత్యనారాయణ, గొడ్డు నాగరాజు, బలిరెడ్డి నాగేశ్వరరావు, అట్టా శంకర్, కంపర రమణ, జీఎం నాయుడు తదితరులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్ గణబాబు

- ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుంది
- నారా లోకేష్ పర్యవేక్షణలో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట
- మల్కాపురానికి దివంగత పైడిరాజు పోలమల్ల కుటుంబానికి ఆర్థిక భరోసా



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 4** : తెలుగుదేశం పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం తమ పార్టీ బాధ్యతగా భావిస్తోందని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు పేర్కొన్నారు. పార్టీకి సేవలందించిన కార్యకర్త, మల్కాపురం ప్రాంతానికి చెందిన దివంగత పైడిరాజు పోలమల్ల అకాల మరణం టీడీపీ కుటుంబానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యవేక్షణలో కొనసాగుతున్న "కార్యకర్తల సంక్షేమ విభాగం" ద్వారా మంజూరైన రూ. 5 లక్షల ప్రమాద బీమా క్లెయిమ్ చెక్కును పైడి రాజు పోలమల్ల సతీమణి, నామినీ ధనలక్ష్మి పోలమల్లకు శనివారం తన కార్యాలయంలో గణబాబు అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తల కుటుంబాలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రమాద బీమా పథకాన్ని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దివంగత పైడి రాజు కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో ఈ బీమా మొత్తం కొంతమేర ఆర్థిక ఊరటనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ధనలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
భవిష్యత్తులో కూడా పైడి రాజు కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని, కార్యకర్తల సంక్షేమమే పార్టీకి అత్యంత ప్రాధాన్యమని గణబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని దివంగత పైడి రాజు పోలమల్ల సేవలను స్మరించుకున్నారు.

## కురుపాం ఏకలవ్య పాఠశాల సంఘటనపై దర్యాప్తు జరగాలి.

- ఆడపిల్లల విద్యాసంస్థల్లో మహిళా బోధకులే ఉండాలి.
- రోగాల సీజన్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలి.
- వసతి గృహాలు/ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం లను నియమించాలి
- వసతి గృహాలలో దోమల నివారణ చర్యలు చేపట్టాలి
- టీనేజ్ ప్రెగ్నెన్సీ పై అవగాహన తరగతులు నిర్వహించాలి.
- ఐటీడీఏ డిడిని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**పార్వతీపురం జూలై 04 పెన్ పవర్.** పార్వతీపురం జిల్లాలోని కురుపాం ఏకలవ్య పాఠశాలలో జరిగిన సంఘటనపై దర్యాప్తు జరగాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.శనివారం కాంగ్రెస్ పార్టీ డిసిసి వంగల దాలినాయుడు,పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో డిడి ఏ.విజయశాంతితో సాక్షి దినపత్రికలో వచ్చిన కురుపాం ఏకలవ్య పాఠశాలలో జరిగిన సంఘటన విషయమై చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల కళాశాలలో చదువుతున్న మైనర్ విద్యార్థినులకు ఇలా జరగటం బాధాకరమన్నారు.దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని.బాధ్యులను చట్ట ప్రకారం శిక్షించాలి గతంలో కూడా కురుపాం ఏకలవ్య పాఠశాలలో పలు సంఘటనలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయన్ని ఆ పాఠశాలతో పాటు ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆడపిల్లల పాఠశాలలు కళాశాలలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలి.ఇటువంటి సంఘటనల వలన విద్యార్థులు చదువుకు దూరమై భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి అలాగే ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఆడపిల్లల పాఠశాలలో మహిళ స్టాఫ్ నే నియమించాలి.ఆయా వసతి గృహాలలో ఏఎన్ఎం లను నియమించాలన్నారు.దోమల నివారణ చర్యలు మినరల్ వాటర్ అందించాలన్నారు.మలేరియా,డెంగ్యూ, చికున్ గున్యా,టైఫాయిడ్,పచ్చకామెర్లు,రక్తహీనత తదితర రోగాలు విద్యార్థులు దరి చేరకుండా అప్రమత్తం కావాలన్నారు.మెనూ పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు.ఆడపిల్లల పాఠశాలలు కళాశాలలో టీనేజ్ ప్రెగ్నెన్సీ పై అవగాహన తరగతులు నిర్వహించాలన్నారు.అనేక సమస్యలపై ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గొట్టాపు రేణుక,అధ్యక్షురాలు బసవ వసుంధర,మహిళా నాయకురాలు,వారణాసి, తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్పర్సన్

- ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర సొంత నిధులతో విగ్రహం ఏర్పాటు.
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 04.**మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర తన సొంత నిధులతో ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు నూతన విగ్రహానీ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా విచ్చేసి తన చేతులు మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పి చైర్పర్సన్ సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ.. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు గిరిజనుల ఆత్మగౌరవానికి, హక్కులకు ప్రతీక అని అన్నారు. బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి పోడు భూముల కోసం, అడవి బిడ్డల కోసం ప్రాణాలు అర్పించిన మహా యోధుడు అని ప్రశంసించారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర సొంత ఖర్చులతో విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇది గిరిజన యువతకు స్ఫూర్తినిస్తుందని కొనియాడారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అల్లూరి జయంతి వేడుకల్లో జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు 1897 జూలై 4న ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంగి గ్రామంలో వారి అమ్మమ్మ ఇంట్లో జన్మించాడన్నారు. పాండ్రంగి తొలి బాల్యం గడిపిన ఆయన నర్సాపురం, తుని, విశాఖపట్నంలో విద్యాభ్యాసం చేసినట్లు ఆమె తెలిపారు. తండ్రి మరణంతరం విశాఖ ఏజెన్సీలో వచ్చిన ఆయన గిరిజనుల కష్టాలను, బ్రిటిష్ వారి దోపిడిని చూసి గిరిజనుల హక్కుల కోసం మన్యం తిరుగుబాటు చేపట్టినట్లు ఆమె తెలిపారు. అరకు, పాడేరు, రంపచోడవరం ప్రాంతాలలో వందలాదిమంది గిరిజనులను ఐక్యం చేసి గిరిజనుల రక్షణ కొరకు బ్రిటిష్ వారితో పోరాటం సాగించారన్నారు. అందులో మల్లు దొర, గాము గంటం దొర, మరి కామయ్య వంటి వారు ఉన్నారని, ముంచంగిపుట్టు మండలానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు మాగ కిర్సాని కూడా ఉద్యమంలో పాల్గొన్నట్లు చైర్పర్సన్ వెల్లడించారు. అల్లూరి చూపిన పోరాట స్ఫూర్తితో గిరిజనుల హక్కులు, చట్టాల కొరకు నేటితరం పోరాడాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హాయంలో అల్లూరి సీతారామరాజు పేరిట ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా రేపు భోగాపురం ఎయిర్పోర్ట్ ను కూడా అల్లూరి సీతారామరాజు పేరుతో నామకరణ చేస్తున్నారని ఆమె తెలిపారు. జోరు వానలో కూడా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరగడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండలం ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైసీపీ జేసిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ అరబీర జగబంధు, వైసీపీ ముంచంగిపుట్టు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మ రావు, ఎంపీటీసీలు మజ్జి సుబ్బలక్ష్మి, బి.కమల, గణపతి, జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు కే. జయదేవ్, మండల వైసీపీ కార్యదర్శి ముఖి రాంప్రసాద్, ఆర్టిఐ అధ్యక్షులు అర్జున్, వైసిపి నాయకులు నరసింగరావు, సాధురం, దామోదర్, దశరథ్, కోడా సాదూరం, రామకృష్ణ, చంద్రరావు, శోభ, రాంబాబు, జలంధర్, బైరాగి, విజయ్ కుమార్, మఠం రాజేంద్రప్రసాద్, బొడ్డెక్ బుద్ధ, రాంబాబు, దాసు, సన్యాసిరావు, పాపారావు, సింహాద్రి, గణపతి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాలు మరువలేనివి.

**జెడ్పిటిసి పోతురాజు బాలయ్య.**

**చింతపల్లి పెన్ పవర్ జూలై 4.** మన్యం వీరుడు అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు మరువలేనివని జెడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. శనివారం అల్లూరి 129వ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అల్లూరివిగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద గిరిజన ప్రజల ను బ్రిటిష్ పాలకులు వేదనలకు గురి చేస్తున్న సందర్భంలో గిరిజనుల అండగా నిలిచి, గిరిజనుల పక్షాన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. బానిస సంకెళ్ల నుండి విడుదల చేయడానికి ఆయన చూపిన పోరాట పటిమ అసమానమైందన్నారు. అల్లూరి సీతారామరాజు ఎప్పుడు ప్రజల గుండెల్లో పోరాట స్ఫూర్తితో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాజీ సర్పంచ్ కంకిపాటి వీరన్న పడాల్, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు పాంగి గణబాబు, కంకిపాటి గిరి ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బేతాళుడు, కో ఆప్షన్ సభ్యుడు నా జరువల్లి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి. వినాయకరావు, దూనబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 4:** మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టి. నిశాంతి ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల పరిరక్షణ, దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి పోరాడిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన ఆశయాలు, విలువలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ అల్లూరి చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదుర్కొని గిరిజనుల హక్కుల కోసం అల్లూరి చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. రాజకుటుంబంలో జన్మించినప్పటికీ గిరిజనుల కష్టాలను తనవిగా భావించి స్వాతంత్ర్య సమరంలో విశేష పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందని అభినందించారు. జయంతి వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఏపీసీ చైర్మన్ వెంకటరమణ, మాజీ ఎంపీపీ బొర్ర విజయరాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## అడవి ఆదివాసులకు ఆధారం లేకుండా చేస్తామంటే అంతు చూస్తాం.

- అల్లూరి స్ఫూర్తితో మరో గిరిజన ఉద్యమం.
- గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 4.** అడవి ఆదివాసులకు ఆధారం లేకుండా చేస్తామని అంటే వారి అంత చూస్తామని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయపడాలన్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు 129వ జయంతి పురస్కరించుకొని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్సైట్, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో విలువైన అటవీ భూములను కార్పోరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. 5 షెడ్యూల్ భూభాగం అంతా ఆదివాసీలదే అన్న విషయం ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ మరియు బాక్సైట్ ఖనిజాల పేరుతో గిరిజనులను అడవి నుండి వెళ్లగొట్టాలని ప్రయత్నం చేస్తుందని ఆయన మండిపడ్డారు. అదే జరిగితే అల్లూరి స్ఫూర్తితో మరో గిరిజన ఉద్యమం తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి, కే సింహాచలం, పి నాగేష్, టి ఆనంద్, కే సరస్వతి, కే శాంతి, ఎస్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు,కాలువల పనులకు భూమి పూజ



- 75 లక్షల జీవీఎంసీ నిధులతో పైనాపిల్ కాలనీ సిసి రోడ్లు కాలువల నిర్మాణ పనులు
- శాసనసభ్యులువె లగపూడి రామకృష్ణ బాబు

**విశాఖ తూర్పు,పెన్ పవర్ జూలై 4:**జీవీఎంసీ,13వ వార్డు, పైనాపిల్ కాలనీ గ్రామంలో జీవీఎంసీ నిధులు75 లక్షల రూపాయలతో కాలువలు, రోడ్లు,నిర్మాణ పనులకు తూర్పు నియోజవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు,శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవీఎంసీ నిధులతో సి సి రోడ్లు మరియు కాలువల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు అయన తెలిపారు,రోడ్లు నిర్మాణం చేపట్టక ముందే యుజిడి పనులు పూర్తిచేయాలని,ప్రతి ఇంటి పైపులైన్ మరమ్మతులు చేపట్టి యుజిడి అనుసంధానం పూర్తి చేయాలని, అనంతరం రోడ్డు పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గృహ యజమానులు విధిగా యుజీడికి కలుపుతూ పనులు పూర్తి చేసుకోవాలని, సిబ్బందికి సంప్రదించి చలానా కట్టి పనులు పూర్తి చేసుకోవాలని గృహ యజమానులకు తెలియజేశారు. కార్యక్రమం లో జీవీఎంసీ ఇంజనీరింగ్ డి ఇ చంద్రమౌళి,ఎ ఇ భరత్, వర్క్ ఇన్స్పెక్టర్ వేణు కుమార్.మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ. వార్డ్ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,ఉపాధ్యక్షులు మారిక జక్కన్న,యల్లమిల్లి సురేష్,మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి,.నాయకులు ప్రసాద్,ఓశెట్టి గురుమూర్తి, మాసాబత్తుల శ్రీను,కనకల శ్రీను.ఓశెట్టి పైడిరాజు, చింతలపూడి నాగేశ్వర్రావు, నెల్లి అప్పారావు,సూరిశెట్టి శ్రీనివాస్,వాసు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన్యం వీరుడుకు ఘన నివాళులు

**కూర్మన్నపాలెం: పెన్ పవర్, జూలై 04:**మహా విశాఖ నగరపాలక సంస్థ 87వ వార్డులో స్వాతంత్ర్య సమరయోధులు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం గ్రామంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని , అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణ త్యాగం చేసింన విప్లవ వీరుడని నేటి సమాజం ఆయన సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం పేదలకు బట్టలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, మాజీ హాస్పిటల్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ రాజన్



రాజు, జిల్లా నాయకులు కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ ఏ. సుబ్బరాజు, ఎ. భాస్కర్రజు, బీవిఆర్. రాజు, ఎస్ రామరాజు, ఐ. సన్యాసిరాజు, బి వి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి స్ఫూర్తితో 1/70 చట్ట పరిరక్షణకు ఉద్యమించాలి



**1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 4:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా శనివారం జీకే వీధి మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి మాన్యంలో గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటాలను నాయకులు స్మరించుకున్నారు.ప్రస్తుతం గిరిజనుల రక్షణ కవచమైన 1/70 చట్టాన్ని సవరించాలని కొందరు ఆదివాసేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఆదివాసీ ఉమ్మడి ఐక్యవేదిక, పేసా కమిటీల ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో 1/70 చట్టం ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు చదువుకున్న నిరుద్యోగ యువత ముందుండాలని పిలుపునిచ్చారు.పార్టీలకు అతీతంగా గ్రామస్థాయి నుంచే ఉద్యమం చేపట్టకపోతే గిరిజన హక్కులు, చట్టాలను కాపాడుకోవడం కష్టమవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం జరిగే ఐక్య పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, పేసా మండల ఫోరం అధ్యక్షుడు కొర్ర బలరాం, మాజీ టీడీపీ జిల్లా కార్యదర్శి ముక్కాలి మహేష్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాకూరి వెంకటరమణ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గాజువాకలో ఘనంగా వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు




**గాజువాక :పెన్ పవర్, జూలై 04:**పేదల ఇల్ల పట్టాల కోసం నిరాహార దీక్ష చేపట్టి ప్రత్యర్థుల చేత హత్యకు గురైన ప్రముఖ కాపు సంఘ సేవకులు వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ , శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సేవా సంఘం ఉపాధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. కాపు సంఘం నాయకులు కొసిరెడ్డి గణేష్ అధ్యక్షతన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జోహార్ వియం రంగా జోహార్ అంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ పేదల ఇళ్ల పట్టాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో ప్రత్యర్థులు హత్య చేసారని అన్నారు. వారి హత్యకు నిరసనగా విజయవాడలో జరగిన అల్లర్లలో 42 మంది మృతి చెందారని అన్నారు. కొన్ని నెలల పాటు విజయవాడ గుంటూరు జిల్లాలో ఖర్ఫ్యూ విధించిన విషయాన్ని గుర్తు చేసారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

## రేపు దేవరపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 4:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఇకపై గ్రామ సచివాలయాల స్థాయిలో నిర్వహించనున్నట్లు జీకేవీధి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బిహెచ్‌వీ రమణబాబు తెలిపారు.ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో, జూలై 6వ తేదీ సోమవారం దేవరపల్లి గ్రామ సచివాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను ఈ కార్యక్రమం ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని కోరారు.గ్రామ స్థాయిలోనే ప్రజల వినతులను స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ విధానం దోహదపడుతుందని ఎంపీడీవో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ం

## నూతన టీడీపీ కార్యాలయం ప్రారంభించిన ప్రభుత్వ విప్.



**కొమరాడ జూలై 04 పెన్ పవర్.**మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం నాడు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పార్టీ బలోపేతానికి మండల కార్యాలయాలు కీలక వేదికలుగా నిలుస్తాయని అన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకుని,వాటి పరిష్కారానికి పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు చురుకుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.నూతన కార్యాలయం ప్రారంభం సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శు భాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మండల,నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు,కూటమి నాయకులు,కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి 129 వ జయంతి

- విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించిన వార్డు నాయకులు



**విశాఖ తూర్పు,పెన్ పవర్ జులై 4**:నియోజకవర్గం, జీవీఎంసీ, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ శనివారం రామకృష్ణాపురంలో మన్యం వీరుడు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విశాఖపట్నం జిల్లా పాండ్రంకి గ్రామంలో జన్మించారని స్వాతంత్ర సమర పోరాటంలో గెరిల్ల యుద్ధ పోరాటం, అనుచరులతో కలిసి బ్రిటీష్ సైన్యానికి సవాలుగా నిలిచి, బ్రిటిష్ తూటాలకు ఎదురెల్లి నేలకొరిగి ప్రజల హృదయాల లో అమరుడుగా నిలిచారని, మహోన్నత వ్యక్తి జయంతి జరుపుకోవడం గర్వంగా భావిస్తున్నామన్నారు.కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి,ఉపాధ్యక్షులు మారిక జక్కన్న,వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, నాయకులు మాసాబత్తుల శ్రీనివాస్, కనకల శ్రీను,నెల్లి అప్పారావు, ఓసెట్టి పైడిరాజు, శ్రీనివాస్ శ్రీదేవి,రాజేష్,గురజాపు వాసు తదితరులు పాల్గొన్నారు.

# సుగంధ ద్రవ్యాల పంటలపై రాయితీ విడుదల.

- భారత ఆదివాసి సమాఖ్య అధ్యక్షులు రామగోపాల్ గడుతూరి.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 4.** భారతీయ సుగంధ ద్రవ్యాలమండలి ( స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా ) సుగంధ ద్రవ్యాల పంటలపై రాయితీలను విడుదల చేసిందని భారతీయ ఆదివాసీ సమాఖ్య అధ్యక్షులు రామగోపాల్ గడుతూరి ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు( ఎఫ్ పి ఓస్ ) మరియు రైతు ఉత్పత్తిదారుల కంపెనీలకు( ఎఫ్ బి సి ఎస్ ) స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా రాయితీలు అందించకపోవడంతో ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా లోని క్షేత్రస్థాయి అధికారిని మరియు కొందరు రైతులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వారి అభ్యర్థన మేరకు భారతీయ సుగంధ ద్రవ్యాలమండలి ( స్పైసెస్ బోర్డు ఆఫ్ ఇండియా ) కార్యదర్శి ఎంఎస్ మణి వన్నన్ తో మాట్లాడి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఎఫ్ బి ఓ లు మరియు ఎఫ్పీలకు రాయితీలను విడుదల చేయాలని కోరడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన ఆయన రాయితీ మొత్తాన్ని విడుదలకు ఏర్పాట్లు చేశారన్నారు. అడిగిన వెంటనే రాయితీ నిధులను విడుదల చేసినందుకు భారతీయ సుగంధ ద్రవ్యాలమండలి కార్యదర్శి ఎంఎస్ మణివన్నన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే క్షేత్రస్థాయి పర్యటన కోసం అల్లూరి జిల్లాను సందర్శించవలసిందిగా ఆయనను ఆహ్వానించడం జరిగిందన్నారు దీనికి ఆయన సానుకూలంగా స్పందించి వచ్చేవారం జిల్లా పర్యటనకు వస్తానని చెప్పారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు రామ గోపాల్ గడుతూరి తెలియజేశారు.

# ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు విజ్ఞాన్ కళాశాలలో అవగాహన సదస్సు



**కూర్మాన పాలెం: పెన్ పవర్,జూలై 4:** దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్, ఐఈఈఈ పవర్ అండ్ ఎనర్జీ సొసైటీ , ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ సొసైటీ, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా ఫ్రమ్ క్లాస్‌రూమ్ టు ఇండస్ట్రీ ఆపర్చునిటీస్ ఫర్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ పీఎస్‌యూల సీనియర్ మేనేజర్ శ్రీ అరుణ్ ఎ. పాటిల్ ముఖ్య వక్తగా పాల్గొని, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు పరిశ్రమలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలు, మారుతున్న సాంకేతిక ధోరణులు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ ప్రణాళికపై తన అనుభవాలను పంచుకున్నారు. పవర్ సిస్టమ్స్, పునరుత్పాదక ఇంధన రంగం, రక్షణ, ఆటోమేషన్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీలు వంటి రంగాల్లో ఉన్న విస్తృత అవకాశాలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమస్య పరిష్కార నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, పరిశ్రమకు అవసరమైన సర్టిఫికేషన్లు పెంపొందించుకోవాలని సూచించారు. ఇంటర్న్‌షిప్‌లు, సాంకేతిక ప్రాజెక్టులు, పరిశోధన కార్యక్రమాలు, ఐఈఈఈ వంటి వృత్తిపరమైన సంస్థల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా భవిష్యత్‌లో మెరుగైన కెరీర్‌ను నిర్మించుకోవచ్చని తెలిపారు. 150 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని కెరీర్ ప్రణాళిక, ఉన్నత విద్య అవకాశాలు, పరిశ్రమలో విజయవంతం కావడానికి అవసరమైన నైపుణ్యాలపై విలువైన అవగాహన పొందారు. ఈ కార్యక్రమాన్ని డా. చందు నాయక్, బి. దివాకర్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు, డా. టి. వి. మధుసూదన రావు, ఈఈఈ విభాగాధిపతి డా. పూడి శేఖర్ కార్యక్రమాన్ని అభినందిస్తూ, పరిశ్రమ-–విద్యాసంస్థల సమన్వయంతో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులను విజయవంతమైన ఇంజినీర్లుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని తమ సాంకేతిక నైపుణ్యాలను, ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టిస్తారా

**టిడిపి నేతల తీరుపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే గణేష్**



**నర్సీపట్నం, పెన్ పవర్ (జూలై 4)** :అధికారులను, నాయకులను నిలదీశాడనే అక్కసుతో తమ పార్టీ నాయకుడు సుర్ల నూకరాజును రూరల్ ఎస్సై రాజారావు దారుణంగా కొట్టారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. శనివారం మధ్యాహ్నం ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నూకరాజును గణేష్ పరామర్శించారు. అసలు ఏం జరిగింది అనే విషయాన్ని బాధితుడుని అడిగి తెలుసుకున్నారు. నూకరాజు మాట్లాడుతూ వేములపూడి పంచాయతీ అప్పన్నపాలెం సచివాలయం వద్ద కొత్త పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతుందనే సమాచారం మేరకు తన తల్లికి సంబంధించిన పాస్ బుక్ కోసం అక్కడికి వెళ్లానని తెలిపాడు. ఆ సందర్భంలో గతంలో జగన్ ప్రభుత్వం సర్వే చేసి ఇచ్చిన పాస్ పుస్తకాలే, ఇప్పుడు కొత్తగా మీరు ఇస్తున్నారని, కొత్తగా మీరు ఏం చేశారని, అప్పుడు ప్రభుత్వాన్ని విమర్శించిన మీరు ఇప్పుడు ఏం చెబుతారని నిలదీశానన్నాడు. అక్కడనుండి తనను గెంటివేశారని, తాను ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నానని తెలిపాడు. సుమారు నాలుగు గంటల సమయంలో ఇద్దరు కానిస్టేబుల్లు వచ్చి తనను రూరల్ పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లారని తెలిపాడు. ఆ తరువాత రూరల్ ఎస్సై రాజారావు తనను అమానుషంగా కొట్టడమే కాకుండా, తనతో వారికి అనుకూలంగా వీడియో వాంగ్మూలం చెప్పించుకున్నాడని ఆరోపించాడు. నూకరాజును పరామర్శించిన తరువాత మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కేవలం అధికారులను, నాయకులను ప్రశ్నించినందుకే తమ పార్టీ నాయకుడు నూకరాజును పోలీసులతో కొట్టించారని ఆరోపించారు. నర్సీపట్నం చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా వీడియో కాల్ చేసి టిడిపి నాయకులు చూసేలా నూకరాజును కొట్టారన్నారు. అంతే కాకుండా లాఠీలకు జండూబామ్ రాసి కొట్టారని, బూటు కాలుతో ఇష్టానుసారం తన్నారని, ఇంత అమానుషంగా ఎస్సై రాజారావు ప్రవర్తించడం దారుణం అన్నారు. ప్రభుత్వం చేతకానితనాన్ని ప్రజలు నిలదీస్తుంటే కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రశ్నించే హక్కు లేదా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. డిఎస్పి, ఎస్పీ లకు ఫిర్యాదు చేస్తామని, ఎస్సై పై చర్యలు తీసుకోకుంటే హైకోర్టులో ప్రైవేటు కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బోళెం వెంకటేష్, చినబాబు, కోనేటి రామకృష్ణ, వైసిపి లీగల్ సెల్ అధ్యక్షుడు బుల్లిదొర, ఏక శివప్రసాద్, సుర్ల నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కుల సాధన జరిగినప్పుడే అల్లూరికి నిజమైన నివాళి.

- చింతపల్లిలో ఘనంగా మన్యం వీరుని జయంతి వేడుకలు.
- ఎంపీపీ అనూష దేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయభారతి.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 4.** బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు చింతపల్లి మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. అల్లూరి త్యాగాలను, ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషా దేవి, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తదితరులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి పోరాట గాధలను కొనియాడారు. బ్రిటిష్ పాలకుల కఠిన అటవీ చట్టాలు, దోపిడీకి, అణిచివేతకు బలవుతున్న మన్యం గిరిజనులలో అల్లూరి సీతారామరాజు అఖండమైన విప్లవ స్ఫూర్తిని రగిలించారని గుర్తుచేశారు. గూడెం-రంప ప్రాంతాల్లో అమాయకులైన అడవి బిడ్డలను ఏకం చేసి, తమ హక్కుల సాధన కోసం విల్లంబులు పట్టి పోరాడేలా చేసిన ఆయన ధైర్యసాహసాలు అసమానమైనవని పేర్కొన్నారు. గిరిజనులకు గెరిల్లా యుద్ధ తంత్రాలు నేర్పి, వారిలో ఆయన నింపిన ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవని కీర్తించారు. నాడు అటవీ హక్కుల కోసం అల్లూరి చేసిన వీరోచిత పోరాట స్ఫూర్తిని ప్రతి గిరిజనుడూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూషా దేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి పిలుపునిచ్చారు. అదే పోరాట స్ఫూర్తితో నేటి గిరిజనులు తమకు రాజ్యాంగం, చట్టాలు కల్పించిన హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని వారు ఉద్ఘాటించారు. తమ హక్కుల పట్ల అవగాహన పెంచుకొని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే అల్లూరికి మనం అర్పించే నిజమైన నివాళి అని వారు స్పష్టం చేశారు. అనంతరం అల్లూరి జయంతిని పురస్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా.. 'చేయూత వారియర్స్ ట్రస్ట్' ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. సమాజానికి మేలు జరిగేలా యువత ముందుకు రావాలని కోరుతూ, ఈ శిబిరంలో ఎంపీపీ అనూషా దేవి, ప్రిన్సిపాల్ విజయ భారతి లతో పాటు వివిధ శాఖల అధికారులు, యువత స్వయంగా రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సిహెచ్. జయలక్ష్మి, మండల కో-ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి. వినాయకరావు, డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి టి. జగత్ రాయ్, ఎంఆర్పీఎస్ పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎం. దారబాబు, చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యుడు దూనబోయిన రమణలతో పాటు విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# అల్లూరికి రక్తదానంతో ఘన నివాళి.




- చేయూత వారియర్స్ ఆధ్వర్యంలో 62 మందితో రక్తదానం.
- ఆదర్శంగా నిలిచిన అధికారులు, ప్రజాప్రతినిధులు.. ఉత్సాహంగా పాల్గొన్న యువత.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 4.** మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని చింతపల్లిలో వినూత్న రీతిలో ఘన నివాళులు అర్పించారు. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, దేశం కోసం ప్రాణాలర్పించిన ఆ వీరుని స్ఫూర్తితో ఆపదలో ఉన్న వారిని ఆదుకునే ఉద్దేశ్యంతో 'చేయూత వారియర్స్ ట్రస్ట్' అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి సర్వత్రా విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, అలాగే స్థానిక యువత పెద్ద ఎత్తున తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అందరికీ ఆదర్శ ప్రాయంగా నిలిచింది. స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పీటీసీ పోతురాజు బాలయ్య, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతితో పాటు చింతపల్లి పోలీసు, అటవీ శాఖ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు ఈ శిబిరంలో పాల్గొని స్వయంగా రక్తదానం చేశారు. వారిని ఆదర్శంగా తీసుకుని అనేక మంది యువత సైతం ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఏరియా ఆసుపత్రి చింతపల్లి, నర్సీపట్నం బ్లడ్ సెంటర్, అలాగే రెడ్ క్రాస్ సొసైటీల సంయుక్త సహకారంతో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 62 మంది దాతలు రక్తాన్ని దానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మందిని కాపాడేందుకు యువత, అధికారులు ఒకే వేదికపైకి వచ్చి ఈ సేవా కార్యక్రమంలో పాలుపంచుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆర్గనైజింగ్ సభ్యుడు రమణ, ఆసుపత్రి బ్లడ్ సెంటర్ నిర్వాహకుడు అనిల్ కీలక పాత్ర పోషించారు. వీరికి తోడుగా స్థానిక యువకులు గాజుల శ్రీను, గిరి, సాయి, రెడ్ క్రాస్ సిబ్బంది ప్రసాద్, నాయుడు, తాతబాబు, నర్సీపట్నం బ్లడ్ సెంటర్ సిబ్బంది వెంకటేష్, ప్రసాద్ తదితరులు సమన్వయంతో సేవలందించారు. అల్లూరి జయంతి రోజున సామాజిక బాధ్యతతో వినూత్నంగా నివాళులర్పించిన 'చేయూత వారియర్స్ ట్రస్ట్' సేవలను పలువురు ప్రశంసించారు.

# అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్

- స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 4:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం పాడేరులో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావడంతో పాటు తమ పోలింగ్ బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయించేందుకు కృషి చేయాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నందోలి ఉమామహేష్, పెనమాక రవికుమార్, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, మండల అధ్యక్షుడు వేగం మహేష్‌బాబు, ఎస్ఐఆర్ ఇన్‌చార్జి చల్లా రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కుడుముల వెంకటరమణ, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్కీ అబ్బాయిదొర, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాస పాపిటరాజు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్ పాత్రుడు, మండల నాయకుడు పాండి సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జులై 7 న ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం

- పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు రద్దు చేయాలనీ ఆటో కార్మికుల నిరసన కార్యక్రమం జయప్రదం చేయండి: సిఐటి యు




**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 4:** సిఐటియు ఆధ్వర్యంలో శనివారం జగదాంబ సెంటర్ లో జరిగిన నిరసన కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కే సత్యనారాయణ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా జులై 7న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి అందులో భాగంగా విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ఏడవ తారీఖున కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు ముఖ్యంగా క్రూడాయల్ ధరలు తగ్గుతున్నప్పటికీ డీజిల్ ధరలు పెట్రోల్ ధరలు తగ్గకపోవడం సిగ్గు చేటు అని డీజిల్ పెట్రోల్ పై ఆధారపడి బ్రతుకుతున్నటువంటి ఆటో కార్మికులకు దీని మూలంగా ఆర్థిక ఇబ్బందులు అవుతున్నాయని అంతేకాకుండా ప్రజానీకానికి అందరికీ కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్కూటర్లు వాడిన దగ్గర నుండి లారీ వరకు కూడా ఈ డీజిల్ పెట్రోల్ అనేది కచ్చితంగా అవసరం అని కావున ఈ భారం అనేది ప్రజలందరికీ కూడా ఇబ్బంది కలుగుతుందని కావున తక్షణమే పెంచిన పెట్రోల్ డీజిల్ తగ్గించాలని ఆటో కార్మికులకు ప్రజా రవాణా చేస్తున్నందువలన పెట్రోల్ డీజిల్ సబ్సిడీ ధరకు అందించాలని డిమాండ్ చేస్తూ ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు ఈ కార్యక్రమంలో శేషుబాబు గణేష్ రాము పాల్గొన్నారు.

# అల్లూరి విజ్ఞాన కేంద్రం లో అల్లూరి 129వ జయంతి వేడుకలు




**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 4:**బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని గడగడ లాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగాయి. అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురజాడ సాంస్కృతిక వేదిక నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఏసిపి కే సత్యనారాయణ, ఇంటర్నేషనల్ వాకర్స్ 101 డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేష్, అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కోశాధికారి వి ఎస్ పద్మనాభ రాజు పాల్గొన్నారు. ముఖ్య అతిధులను గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు అల్లూరి చిత్రపటానికి ముఖ్య అతిథులంతా కలిసి పూలమాలవేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిధి మాట్లాడుతూ అల్లూరి చిన్ననాటినుండే జాతీయ భావాలు కలిగి ఉండేవారని, ఆనాటి బ్రిటీష్ పాలకులు దుర్మార్గమైన రిజర్వు ఫారెస్ట్ యాక్ట్ ను ప్రయోగించి అమాయకులైన గిరిజనులపై మోయలేని రీతిన పన్నులు విధించడమే గాక అనేక రీతుల్లో అన్యాయాలు అత్యాచారాలు దౌర్జన్యాలకు ఒడిగట్టేవారని,ఇవి చూసి సహించలేని అల్లూరి, వారిని కూడగట్టి అహింసా మార్గాల ద్వారా బ్రిటీష్ వారి అకృత్యాలను అరికట్టలేమని భావించి పోలీస్ స్టేషన్స్ ముందుగానే సమాచారం ఇచ్చి మరీ దాడి చేసి ఆయుధాలు సేకరించి ప్రాణాలు తెగించి పోరాడి బ్రిటీష్ వారి కంటికి కునుకు లేకుండా చేశారని, చివరకు కొయ్యూరు దగ్గర మేజర్ గుడాల్ , అల్లూరిని చెట్టుకు కాల్చి చంపేశాడని, 27 ఏళ్లకే ప్రాణ త్యాగం చేసిన మహా వీరుడని, అల్లూరి వారి అసలు పేరు రామరాజు తప్ప సీతారామరాజు కాదని, స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు అయినా, గిరిజనులకు అన్యాయం చేసే రిజర్వు ఫారెస్ట్ యాక్ట్ ఇప్పటికీ అమలులోనే వుందని, ఆయన నడిచిన బాటలో మనం నడవడం ద్వారా దేశ ప్రగతి కోసం,గిరిజనుల అభ్యున్నతి కోసం మన వంతు కృషి చేయాలని తెలిపారు.

వాకర్స్ గవర్నర్ మహేష్ మాట్లాడుతూ అల్లూరి పేరు వింటేనే తనువు పులకరిస్తుందని,ఆయన మన విశాఖ జిల్లాలోనే జన్మించడం మనందరికీ గర్వకారణమని, ఆయన ఏ ఆశయాలకోసం ప్రాణ త్యాగం చేసేరో అవి నెరవేరేందుకు మనమందరం నడుం కట్టి నడవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కోశాధికారి వి ఎస్ పద్మనాభ రాజు మాట్లాడుతూ అల్లూరి తన జీవితాన్ని తృణప్రాయంగా ఎంచి భారత దేశ విముక్తి కోసం ప్రాణాలర్పించారని, గిరిజనులపై జరుగుతున్న దోపిడీ దౌర్జన్యాలపై సమర శంఖం పూరించి సాయుధ పోరాటం నిర్వహించారని, స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా అత్యధిక మంది గిరిజనులు ఇప్పటికీ మౌలిక సదుపాయాలు, హక్కులకు నోచుకోవడం లేదు సరికదా వున్న హక్కులు హరించేటట్లు ప్రభుత్వాలు గిరిజన చట్టాల్లో మార్పులు చేస్తున్నాయని కావున గిరిజన హక్కులు, వారి అభ్యున్నతి కోసం మన వంతు కృషి చేయడమే అల్లూరు గారికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.జివిస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి మన విశాఖపట్నం జిల్లాలో పుట్టడమే కాక మన విశాఖ ఏవీఎన్ కాలేజీ హైస్కూల్లో కొంత కాలం పాటు చదువుకోవడం మనకు గర్వకారణమనిఅల్లూరి, దేశసంచారం చేస్తూ ప్రముఖులను కలిసి వారితో అభిప్రాయాలు పంచుకుని తిరిగి వచ్చి గిరిజన ప్రాంత ప్రజలు పడుతున్న బాధలుచూసి వారిని సంఘటితం చేసి సాయుధపోరాటం చేసిన గొప్ప ధీరుడని, ఆయన త్యాగాలను ధైర్యసాహసాలను మననం చేసుకుంటూ ఆయన బాటలో మనం కూడా నడవాలని తెలిపారు.బీచుల్లో మందు షాపులను అనుమతించే బీచ్ షాక్స్ పై ప్రజానాట్యమండలి వారు ప్రదర్శించిన "వైజాగ్ గోవా" లఘు నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తం 145 మంది కళాకారులు 35 కళారూపాలను ప్రదర్శించారు. పాల్గొన్న వారందరికీ మెడల్స్, డ్యాన్స్ అకాడమీలకు మెమెంటోలు ఇవ్వడం జరిగింది. గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు పర్యవేక్షణలో గురజాడ సాంస్కృతిక వేదిక అధ్యక్షులు పివి రమణ, కోశాధికారి ఆర్ఎస్ఆర్ మూర్తి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం సభికులను అలరించింది. కోశాధికారి ఆర్ఎస్ఆర్ మూర్తి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పేద ప్రజల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 4:**పేద ప్రజల ఆశాజ్యోతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పోరాడిన నాయకుడు వంగవీటి మోహన్ రంగా అని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన 79వ జయంతిని అంబాజీపేట, మాచవరం లలో ఘనంగా నిర్వహించారు.

కొర్లపాటివారిపాలెం కాపు యువత ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మాచవరం యువత ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి పేద, బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు అరిగెల సూరిబాబు, ఆత్మా డైరెక్టర్ పత్తి దత్తుడు, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, నాయకులు గణపతి వీర రాఘవులు, సుంకర బాలాజీ, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, రవణం రాము, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి సాయికృష్ణ, సూదాబత్తుల రాము, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, మంచాల నోకేష్, సుంకర పేరయ్యనాయుడు, దొమ్మేటి రామారావు, మేడిది శ్రీ ను, అరిగెల శివకళ్యాణ్, రవణం విజయ్, సూదాబత్తుల రమేష్, కామిశెట్టి పండు, వంగా చిన్నా, నాయకులు, రంగా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ర్యాలి జగన్మోహిని కేశవస్వామి సన్నిధికి పోటెత్తిన భక్తజనం



**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 4:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు బుధవారాల జగన్మోహిని కేశవస్వామిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో మొక్కులు చెల్లిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయనే విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

ఉదయం తెల్లవారుజామున స్వామివారికి మేలుకొలుపు సేవతో ఆలయ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం సుప్రభాత సేవ, విశేష అలంకారం, అర్చనలు, ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి సీతారామాచార్యులు శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకానికి విరాళాలు అందించిన దాతలను ఆలయ వేదపండితులు వెంకట అవధాని వేదాశీర్వచనాలతో ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన లలితా పారాయణదారులు శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీ మణిద్వీప పారాయణం నిర్వహించగా, భక్తులు భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, కార్యనిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్‌బాబు పర్యవేక్షణలో తాగునీరు, క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించారని పేర్కొన్నారు

## పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనే లక్ష్యంగా పార్టీ సేవలకు దరఖాస్తు సమర్పించిన జనసేన ఇంచార్జ్ రమేష్




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** కాకినాడలోని ఫాబిన్ కన్వెన్షన్‌లో కాకినాడ పార్లమెంటరీ సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న జనసేన నాయకులు, జనసైనికుల నుంచి పార్టీ పదవులకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల సాధన కోసం మరింత సమర్థవంతంగా పార్టీకి సేవలందించాలనే సంకల్పంతో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తన దరఖాస్తును కాకినాడ పార్లమెంటరీ అబ్జర్వర్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకి సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం, జనసేన సిద్ధాంతాల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, పార్టీ ఏ బాధ్యత అప్పగించిన పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తానని తెలిపారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి జయంతి



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చెన్నారావు ఆధ్వర్యంలో చరిత్ర విభాగం అధ్యాపకులు రాయుడు శ్రీను అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య సమరంలో పోషించిన విశిష్ట పాత్రను, ఆయన దేశభక్తిని, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటాలను కొనియాడారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశ సేవకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద 124 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు...

- యువతక శాశ్వత స్ఫూర్తి స్వామి వివేకానంద...
- రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు...



**నాతవరం, పెన్ పవర్ (జులై 04):** భారతదేశ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానందని రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు అన్నారు. శనివారం మండల కేంద్రమైన నాపవరంల గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ దేశభక్తి చాలా భావం పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి చరస్మరణీయమని అన్నారు. అంతేకాకుండా వ్యక్తిత్వ వికాసం నైతిక విలువలు సమాజ సేవకు ఆయన బోధనలు దిసానిర్దేశం చేస్తున్నాయని అన్నారు. స్వామి వివేకానంద శక్తివంతమైన భారత నిర్మాణానికి యువత ముందుకు రావాలని, విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకోవాలని సమాజ అభివృద్ధి తమ వంతు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కామిరెడ్డి వరహాల బాబు,మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు,నేతల విజయ్ కుమార్, ప్రధాన ఉపాధ్యాయులు కూంద్రపు సత్యనారాయణ,స్కూల్ కమిటీ చైర్మన్ చిటికెల శ్రీను,టిడిపి సీనియర్ నాయకులు జీవిరెడ్డి రాజుబాబు, అంకంరెడ్డి వెంకటరమణ,సామర్ల రామారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లూరి త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శం.....

- దేశభక్తి,సేవా భావం అలవర్చుకోవాలి..
- విద్యార్థులు మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలి....
- మండల విద్యాశాఖ అధికారి కామిరెడ్డి వరహాల బాబు....





**నాతవరం,పెన్ పవర్ (జూలై 04):**విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాలను, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి కామిరెడ్డి వరహాల బాబు అన్నారు. శనివారం నాతవరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ పెద్దలు విగ్రహ ప్రదాత పైల పోతురాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎంఈఓ కామిరెడ్డి వరహాల బాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన అల్లూరి ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను అలవర్చుకుని సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడి బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు.చదువుతో పాటు దేశ చరిత్రను తెలుసుకుని మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు జీవిరెడ్డి రాజుబాబు, ప్రధానోపాధ్యాయులు కే. సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ చిటికెల శ్రీను, అంకంరెడ్డి వెంకటరమణ, సామర్ల రామారావు, రెడ్డి వరహాల బాబు, చిటికెల స్వామినాయుడు, శెట్టి లచ్చబాబు, సింగంపల్లి అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సహకార వారోత్సవాలకు ఘన శ్రీకారం




**కాకినాడ, పెన్ పవర్,జూలై 4**: కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నిర్ణయం మేరకు జూన్ 29 నుంచి జూలై 6 వరకు నిర్వహిస్తున్న సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం కాకినాడ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ప్రాధాన్యత,గ్రామీణాభివృద్ధిలో వాటి పాత్రను వివరించారు.ఈ కార్యక్రమంలో కోలంక సహకార సంఘం అధ్యక్షుడు బొండా వెంకట నరసింహ నాయుడు, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న, డీసీసీబీ సీఈఓ ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్ రెడ్డితో పాటు డీసీసీబీ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సహకార రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు




**కాకినాడ, జూలై 4:** స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మహర్షి సాగర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం డాక్టర్ నాయుడు మాట్లాడుతూ, సాయుధ పోరాటం ద్వారా బ్రిటిష్ పాలకులను ఎదిరించి గిరిజన సైన్యంతో స్వాతంత్ర్య సమరాన్ని నడిపిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహోజ్వల శక్తిగా నిలిచారని అన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని,విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని సమాజానికి సేవ చేసే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు మహర్షి సాగర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు అండగా ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు

* రూ.82 వేల ఆర్థిక సహాయం అందజేత



**ద్రాక్షారామం, పెన్ పవర్,జూలై 4:** ద్రాక్షారామం మార్కెట్‌లో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు స్వచ్ఛందంగా రూ.82 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంకు చెక్కులు, నగదు రూపంలో అందించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రీష్వంత్ రాయ్ మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అగ్నిప్రమాద బాధిత కుటుంబాలు త్వరగా సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున నాగేశ్వరి, డైరెక్టర్లు నారపరెడ్డి బలరాం, పీలుక రాఘవేంద్రరావు, కొల్లు వెంకటేశ్వరరావు, గున్న వినోద్ కుమార్, గుండారపు నాగమణి శ్రీనివాసరావు, కండవల్లి శ్రీనివాసరావు, మరివాడ చిన్న కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నయన మనోహరంగా జనార్ధనస్వామి వారి దర్శనం



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 04;** ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారు శనివారం విశిష్ట అలంకరణలో నయన మనోహరంగా భక్తులకు కన్నుల పండుగ చేశారు. గులాబీలు, కనకాంబరాలు, మల్లెలు, తులసీ మాలల సోయగాలతో స్వామివారు నవ నవోన్మేషంగా వెలుగులీనుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణల భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు ఏర్పాట్లను దగ్గరుండి మరీ పర్యవేక్షించారు.

# అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలి.

-సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ఎస్ రాంకుమార్.



**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 4 :** మన్యం విప్లవ వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, విశ్రాంత ఉపాధ్యాయులు సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ ఎస్ రామ్ కుమార్ అన్నారు. మండల మండల కేంద్రమైన కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర గురించి, ఆయన మన్యం ప్రజల్లో తీసుకువచ్చిన చైతన్యం, స్వాతంత్ర పోరాటంలో ఆయన పాత్ర వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమకారులు జీవిత చరిత్రలను, తెలుసుకొని ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవడమే కాకుండా, ఆశయ సాధన కృషి చేయాలన్నారు. భారతరత్న డాక్టర్ గుల్జారి లాల్ నంద కేంద్ర మంత్రిగా, భారతదేశ ఆపద్మ ప్రధానమంత్రిగా రెండుసార్లు చేసి నిరాడంబ జీవితాన్ని గడిపారని ఆయన జయంతి కూడా ఇదే రోజు అన్నారు. ఆయన చినిపోయే రోజు జేబులో ఒక్క రూపాయి కూడా లేదని అటువంటి మహా నాయకులు ఉన్న భారతదేశం పుట్టడం మన అదృష్టం అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి రమణికుమారి, పాఠశాల ఎక్స్ అఫీషియల్ సభ్యులు దాడి గోవిందు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# బూరుగుపూడిలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు.







**-అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.**

**-ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ణాకులు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 4**:బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి,తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ రాజకీయ నాయకులు స్వాతంత్రం వచ్చిందని చప్పట్లు కొట్టుకుంటున్నారే తప్ప స్వాతంత్రం ఏమీ రాలేదని, ఎక్కడ దోపిడీ అక్కడే జరుగుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. పెద్ద పెద్ద విగ్రహాలు పెట్టి, నివాళులర్పిస్తూ దేశ సంపదను, ప్రజలను దోసుకుంటున్నారని విమర్శించారు. అల్లూరి ఆశయాలు,సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్లాలంటే పెద్ద పెద్ద విగ్రహాలు పెట్టినంత మాత్రాన అవ్వదని ఆయన ఆశయాల కోసం, సిద్ధాంతాల కోసం అనునిత్యం పోరాటం చేయాలని, అప్పుడే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని ఆయన అన్నారు.కార్మికులు,కర్షకులు,రైతు కూలీలు,యువత ఆయన పోరాటాన్ని గుర్తించి ముందుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతరం కర్నాకుల వీరాంజనేయులు తల్లిదండ్రులకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్,డాన్ శ్రీను, బూరుగుపూడి గ్రామస్తులు కర్నాకుల సూరిబాబు,మహేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మందపల్లి శ్రీ మందేశ్వరస్వామి ఆలయానికి రూ.2.87 లక్షల ఆదాయం



**కొత్తపేట, పెన్ పవర్, జూలై 4:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానానికి శనివారం వివిధ పూజలు, విరాళాల ద్వారా రూ.2,86,941 ఆదాయం సమకూరింది.ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తైలాభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముఖమండప సేవల ద్వారా రూ.12,600, ఏకాదశ రుద్ర తైలాభిషేకాల ద్వారా రూ.45,750, మహాన్యాస పూర్వక తైలాభిషేకాల ద్వారా రూ.29,050, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.13,360, తిలదానం ద్వారా రూ.350, స్వయం హోమాల ద్వారా రూ.1,600 ఆదాయం లభించింది. ఈ సేవల ద్వారా మొత్తం రూ.1,02,710 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.అదనంగా ఫోన్‌పే (పీఓఎస్) చెల్లింపుల ద్వారా రూ.30,285, పరోక్ష పూజల ద్వారా రూ.92,200, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.61,746 సమకూరడంతో మొత్తం ఆదాయం రూ.2,86,941కు చేరింది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయంలో నిత్యపూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన్ రంగ కు ఘన నివాళి





**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 4:**వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా ఆత్రేయపురంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణరాజు (బాబు), తాడిపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రమేష్‌రాజు, గ్రామ పెద్దలు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన రంగా సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఆత్రేయపురంలో ఘనంగా నిర్వహించారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గిరిజనుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకుని దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు.

# ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వంగవీటి రంగా -ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 04:** పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయ మని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.

బెల్లంపూడి గ్రామం, ఆదిమూలం వారిపాలెం, నరేంద్రపురం గ్రామాల్లో స్వర్గీయ వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వర్గీయ వంగవీటి మోహనరంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయ మని పేర్కొన్నారు. యువత సమాజ సేవను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఏఎంసు చైర్మన్ చిట్టూరి శ్రీ నివాసరావు, టిడిపి కోఆర్డినేటర్ దాసరి వివి సత్యనారాయణ, తోలేటి చినకాపు, అరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, యడ్ల యేసుభాస్కరరావు, బీర వెంగమాంబ బాపూజీ, తాటికాయల వెంకటేష్, గుత్తుల చంటి, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వంగవీటి మోహనరంగా గారికి ఘనంగా నివాళులర్పించారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com